# వేస్టు జోకర్

పడిసేవ సుందరరామయ్య




ప్రసూతి వార్డులో నడుస్తున్న నిండు గర్భిణిలా విజయవాడ స్టేషన్లోకి వచ్చి నిల్చింది గుంటూరు నుంచి మచిలీపట్నం పోయే పాసెంజర్

పుట్టల్లోంచి బయటకు వచ్చే చీమల్లా యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులు కంపార్టుమెంట్లలోంచి దిగుతున్నారు.

కొన్ని క్షణాల్లో రైలుబండి అంతా దొంగలు దోచిన ఇనప్పెట్టెలా ఖాళీ అయిపోయింది.

అప్పటివరకు ప్లాట్‌ఫారమ్మీద నిలబడివున్న ప్రయాణీకులు ఒక్కరొక్కరే బండి ఎక్కసాగారు

నేను మాత్రం ఓసారి ప్లాట్‌ఫారమంతా పరిసరాలను పరీక్షగా చూసే రోదసీ యాత్రికునిలా గుచ్చి గుచ్చి చూశాను కాని నా కళ్లకు కావాల్సిన దృశ్యం కన్పించలేదు. నా మనస్సు వెతుకుతున్న మనిషి అగుపించలేదు.

వాచీ చూసుకొన్నాను—అయిదున్నర దాటింది

బండి నుంచి విడిపోయిన ఇంజన్ రన్నింగ్ రేసులో దప్పికగొన్న ఆటగానిలా ముందుకు పరిగెత్తింది అది తిరిగి రావటానికి కనీసం పదిహేను నిమిషాలు పట్టొచ్చు భూమిలో వున్న చమురు కోసం అన్వేషించే గాస్ కమిషన్‌లా శ్రద్ధగా నేను ప్రతి కంపార్టుమెంట్‌ను చూసుకొంటూ బయల్దేరాను. కాని నా ఆశ ఫలించలేదు కావాల్సినవారు కన్పించలేదు. ప్రతి రోజు గతి తప్పని గ్రహంలా ఈ బండిలోనే తిరిగే వ్యక్తి ఈ రోజు కన్పించకపోయేసరికి నాకు ఆశ్చర్యం కల్గింది.

కళ్లు అలిసిపోయాయి కాళ్లు నీరసించాయి అలానే సిమెంట్ బెంచీమీద కూర్చుండిపోయాను

మైక్‌లో రైళ్ల రాకపోకల గురించి హడావుడిగా చెప్తున్నారు.

ప్లాట్‌ఫారమ్మీద వెండర్స్ పార్లమెంట్లో అల్లరి చేస్తున్న అపోజిషన్ మెంబర్స్‌లా అరుస్తున్నారు

పరిసరాల్లో ఏం జరుగుతుందో నా మనస్సు పట్టించుకొనే స్థితిలో లేదు నా మనస్సు నిండా ఆ వ్యక్తి గురించే ఆలోచనలు

సృష్టిలో అన్నిటికంటె తీయనిది స్నేహమే నని ఏ క్షణాన అన్నారోకాని అది అక్షరాల నిజం. ఆ పదంలో వున్న లాలిత్యం, ఆ బంధంలో వున్న మాధుర్యం, ఆ ఎడబాటులో వున్న అనుభూతి వర్ణనాతీతం పరిచయం కాకముందు ఎవరికి ఎవరో? పరిచయమయ్యాక ప్రాణస్నేహం! ఆ తర్వాత ఆ స్నేహ మధువు కోసం తహ తహ! ఎందుకీ బంధం? ఏమిటీ ఆకర్షణ? ఈ స్నేహ వలయంలో మనస్సు సాలెగూట్లో పురుగులా ఎందుకు చిక్కుపడిపోతూంది? స్నేహం కోసం ఎలాంటి త్యాగాన్ని చేయటానికైనా మనిషి ఎందుకు సిద్ధపడుతున్నాడు? స్వార్థాన్ని కూడా జయించకల్గే స్నేహం కమ్మని పరిమళాలను వెదజల్లే సుగంధం లాంటిది. అది శాశ్వతం!...

ఆకలితో అలమటించే అన్నార్తుని ఆర్తనాదంలా రైలు అరిచేవరకు నేనీ లోకంలోకి రాలేకపోయాను.

మెల్లగా లేచి నిలబడ్డాను.

దేవదూతలా తెల్లటి దుస్తుల్లో నిగనిగలాడుతున్న గార్డు పచ్చజెండా ఊపుతున్నాడు.

గబగబ నేను అందుబాటులో వున్న కంపార్టుమెంట్లో ఎక్కాను

రైలు కదిలింది తొలిచూలు బిడ్డనెత్తుకొని నడుస్తున్న తల్లిలా. నేను కంపార్టుమెంట్లోకి అడుగు పెట్టగానే అగుపించిన దృశ్యాన్ని చూసి ఆనందపడ్డాను. నూతనోత్సాహం నాలో ప్రవేశించినట్టయింది నిధినిక్షేపాలు దొరికే గని దగ్గరకు చేరినంత సంతోషం కల్గింది. రెండు బెంచీల మధ్య ఓ ఎత్తుపాటి అట్టపెట్టెనుపెట్టి దానిమీద టవల్ పరిచి చతుర్ముఖ పారాయణానికి సిద్ధమౌతున్న ఋషులు కన్పించారు నాకు. తప్పకుండా నేను వెతుకుతున్న వ్యక్తి ఆ పరిసరాల్లో వుండితీరాలన్నది నా గట్టి నమ్మకం! చుట్టుప్రక్కల చూస్తూ వాళ్లను సమీపించాను.

దేవుడు సాక్షాత్కారమయ్యాడని గ్రహించి మెల్లగా కళ్లువిప్పిన మౌనిలా శర్మ నావైపు చూశాడు.

నేను కళ్లతోనే అతన్ని ప్రశ్నించాను

అతను నా భావం గ్రహించాడు. నోరు విప్పకుండా కనుబొమలు ముడిచి తల అడ్డంగా ఊపాడు.

ఇదంతా ఓరకంట గమనిస్తున్న ప్రసాద్, "ఏం గురూ! మీ పార్వతింకా రాలేదనుకొంటాను!" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

నన్ను తిరిగి నీరసం ఆవహించింది.

నిస్సత్తువగా బెంచీమీద కూర్చుండిపోయాను



# వేస్టు జోకర్

పార్వతిని కలుసుకోవాలని ఎంతో ఉత్సాహంతో వచ్చాను నేను

అంతకంటె రెట్టింపు ఉత్సాహంతో తనలో దాచుకొన్న శుభవార్తను పార్వతికి చెప్పాలని ఉవ్విళ్లూరుతూంది నా మనస్సు పార్వతి భుజమ్మీద చేయివేసి, చురుకుగా కదలాడే ఆ కళ్ళల్లోకి చూస్తూ ఈ శుభవార్తను చెప్పాలని, శుభవార్త కల్గించే మధుర భావనలు, సంతృప్తి, సంతోషం పార్వతి కళ్ళల్లో ప్రతిబింబించగా తనివితీర చూస్తుండిపోవాలని ఎంతో ఆశతో వచ్చాను.

కాని పార్వతి రాకపోవటంతో నేను పూర్తిగా నిరుత్సాహపడిపోయాను కొన్ని విచిత్ర పరిస్థితులలో పరిచయం ఏర్పడింది నాకు పార్వతితో —

* * *

'సారీ, మాస్టారూ! ఆ సీటు ఖాళీచేయండి!' అన్న కంఠం విన్పించగానే ఆశ్చర్యంగా తలెత్తి చూశాను.

దాదాపు ఆరడుగులు పొడవున్న విగ్రహం, తెల్లటి పైజామా, తెల్లటి లాల్చీ, ఎర్రటి శరీరచ్ఛాయ — మంచులో తడిసి నిగనిగలాడుతున్న మల్లెమొగ్గలా వున్నాడు భుజమ్మీద వున్న తుండు మనిషిని క్రుంగదీసే బాధ్యతలా బరువుగా వుంది కాబోలు వెంటనే తీసి నా ఎదురుగా వున్న ఖాళీ బెంచీమీద పరిచాడు.

'ఆ విండో దగ్గర సింగిల్ సీటు ఖాళీగా వుంది. అక్కడ కూర్చోండి!' అన్నాడు.

ఆ స్వరంలో కాఠిన్యం లేదు! లాలిత్యం వుంది!

ఆజ్ఞ లేదు! అర్థింపు వుంది!

పణుగుడు లేదు! సంస్కారం వుంది!

సభ్యత, సంస్కారం వున్నవాళ్లంటే నాకెంతో యిష్టం. వాళ్లకోసం ఏ త్యాగమైనా చేయాలన్పిస్తుంది నాకు.

వెంటనే లేచివెళ్లి అతను చూపించిన సీట్లో కూర్చున్నాను

నా మనస్సులో కుమ్మరిపురుగులా తొలుస్తున్న అనుమానాన్ని నివృత్తి చేసుకోటానికి అతన్ని అడిగాను, 'అక్కడెందుకు కూర్చోవద్దన్నారు' అని అతను చిఱునవ్వు నవ్వేడు.

పున్నమి చంద్రునిలా —

వికసించిన మల్లెమొగ్గలా —

'ఈ అసౌకర్యానికి మన్నించాలి సార్! మా ఫ్రండ్స్ వచ్చే స్టేషన్లో ఎక్కుతారు' అన్నాడు.

'వాళ్లకోసం మీరిలా రిజర్వ్ చేయటం వలన మిగతావారికి యిబ్బంది కల్గుతుందికదా!' అన్నాను నేను.

'అఫ్‌కోర్స్! కాని తప్పనిసరి సార్! వాళ్ల కోసం సీట్లు రిజర్వ్ చేయటం నా కర్తవ్యం, బాధ్యత కూడాను! ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించుకొవటంలో తప్పు లేదనుకొంటాను!' అన్నాడు సిగరెట్ వెల్గించుకొంటూ

విండోలోంచి బయటకు చూస్తూ ప్లాట్‌ఫారమ్మీద తిరిగే జనాన్ని, పట్టాలమీద జరిగే రైలుపెట్టెలను చూస్తూ కూర్చున్నాను

'ఎక్కడివరకు వెళ్లాలి సార్?' అడిగాడతను

'మచిలీపట్నం!' అన్నాను ముక్తసరిగా

'రోజూ ఇందులోనే ప్రయాణం చేస్తున్నారా?' అని అడిగాడు అతను సిగరెట్ పొగను పైకి వదులుతూ

'ఇదే మొదటి రోజు!'

'హార్టీ వెల్కమ్ టు యు! మీ రెండులో ఏమి చేస్తున్నారో తెల్సుకోవచ్చా?' నేను చేసే వుద్యోగం సంగతి చెప్పాను

'అయితే మీరు కొత్త మెంబరన్నమాట!' అన్నాడు నవ్వుతూ

మల్లీ వెన్నెల కాసినట్లయింది! మల్లె మొగ్గలు విరబూసినట్లయింది సత్యన్నారాయణపురం స్టేషన్లో రైలాగింది

ప్లాట్‌ఫారమ్ పొడవునా నిలువుగా పేర్చిన పేకముక్కల్లా జనం బారులుతీరి నిలబడివున్నారు

బండి ఆగగానే తేనెతుట్టెలోకి దూరిపోయే తేనెటీగల్లా జనం కంపార్టుమెంట్లలోకి చొచ్చుకొస్తున్నారు.

అతను విండోలోంచి తల బయటకుపెట్టి చేతిరుమాలు ఊపుతున్నాడు

టిఫిన్ బాక్సులను చేతపుచ్చుకొని వచ్చిన నల్గురు మనుషులు అతను రిజర్వ్‌చేసిన స్థలాన్ని ఆక్రమించారు వారిలో ఒకరు హ్యాండ్‌బ్యాగ్‌లోంచి టవలు తీసి మోకాళ్లమీద పరిచాడు ఇంకో వ్యక్తి చేతిలో వున్న పాకెట్‌ను విప్పి పేకముక్కలు బయటకు తీశాడు.

'మాస్టారూ! మీరు కూడా వస్తారా?' అని అడిగాడతను నవ్వుతూ

'నో థాంక్స్!' అన్నాను

'మొహమాటంపడక్కర్లేదు మాస్టారూ!' అన్నాడు వాళ్లలో ఒకడు

అందరూ నవ్వేరు



నా గురించి తెల్సుకొన్న సమాచారాన్ని వాళ్లకు చెబుతూ పేకముక్కలు పంచాడతను.

నేను కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూండి పోయాను.

రైలు వేగాన్ని పుంజుకొని పరుగులు తీస్తూంది.

* * *

'గుడ్‌మార్నింగ్ సార్!' తలెత్తి చూశాను.

'ఓ ... నువ్వా' కమాన్!' అంటూ ఆహ్వానించాను.

'రైలు ప్రయాణానికి అలవాటుపడ్డారా?' సిగరెట్ వెలిగించుకొంటూ అడిగాడు

'చాలా బోర్‌గా వుంది!'

'ఇంతలో మీ ఊరికి ట్రాన్స్‌ఫర్ కాదంటారా?'

'ప్రయత్నాలు చేస్తున్నాను కాని ఎప్పుడు ఫ్‌స్తుందో దేవుడికే తెలియాలి!'

'అయితే మీరు తప్పకుండా కార్డ్స్ నేర్చుకోవాల్సిందే!'

'ఎందుకట?'

'కాలక్షేపం!'

'కాలక్షేపంకోసం ఇవ్వాళ నేర్చుకొంటే రేపు వ్యసనంగా మారి జీవితాన్నే నాశనం చేయొచ్చు!'

అతను నవ్వేడు.

ఈసారి ఆ నవ్వులో వెన్నెల విరియలేదు. మల్లెలు పూయలేదు.

జ్ఞానాన్ని పొందిన సిద్ధుని పెదవులపై విరిసిన దరహాసంలా వుంది ఆ నవ్వు! పేకాటపట్ల అతను ఏర్పరచుకొన్న అనుబంధానికి విదర్శనం ఆ చిఱునవ్వు!

ఎన్నోనెలలుగా అతనితో నాకు పరిచయం ఏర్పడింది. కాని అతని వ్యక్తిగత విషయాలను గురించి ఎప్పుడూ అడగలేదు. పేకాటమీద అతనికంత మక్కువ, ఆసక్తి కల్గటానికి కారణం కూడా తెల్సుకోవాలన్పించింది మెల్లగా సంభాషణలోకి దింపాను.




'ఈరోజు కార్డ్స్‌కు వెలుగును చూపించలేదే?' అని అడిగాను అతని చేతిలో వున్న పాకెట్స్‌వైపు చూస్తూ.

'మీరు ఊ అనండి!' అంటూ పాకెట్లోంచి కార్డ్స్‌ను బయటకు లాగబోయాడు.

'అంత పని చేయకు! అందులో నాకు అ ఆలు కూడా రావు' అన్నాను అతని ప్రయత్నాన్ని వారిస్తూ.

'మీకా భయం అక్కర్లేదు. నా శిక్షణలో మీరు రెండురోజుల్లోనే గుణింతాలు నేర్చుకోకల్గుతారు!'

'థాంక్స్! కాని నాకా అవసరం కన్పించటం లేదు అవునూ, ఈరోజు మీ ఫ్రెండ్స్ ఎవ్వరూ రాలేదేమిటి?'

'వాళ్లకు హాలిడే కదండీ!'

'మరి నీకు హాలిడే లేదా?'

నేను ఆ ప్రశ్న వేయగానే అతను క్షణంపాటు తొట్రుపడి 'వుంది! కాని ఇంట్లో ఏమీ తోచక యిలా వచ్చేను!' అన్నాడు

'మరి మీకు సెలవు లేదా యీ రోజు?' అని అడిగాడు నన్ను.

'సెలవే! కాని మా ఆఫీసర్‌కు ట్రాన్స్‌ఫరయిన సందర్భంలో ఈ రోజు హోటల్లో డిన్నర్ యిస్తున్నాం! అందుకే వెళ్తున్నాను!' అన్నాను

అతను మౌనంగా కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూండిపోయాడు.

'ఇంత కాలంగా నేనడగలేదు. నువ్వు ఏ ఆఫీసులో పని చేస్తున్నావ్?'

ఆ ప్రశ్న వేయగానే అతని ముఖం నలిగి పోయిన పేకముక్కలా మారింది కళ్లల్లో దైన్యం తొంగిచూసింది. నా కళ్లల్లోకి సూటిగా చూడలేక ఒడ్డునపడ్డ చేపపిల్లల్లా అతని కళ్లు రెపరెప లాడాయి.

'నేను ఏ ఆఫీసులోను వుద్యోగం చేయటం లేదు సార్!' అన్నాడు నూతిలోంచి మాట్లాడుతున్న వ్యక్తిలా.

ఈసారి ఆశ్చర్యపడటం నా వంతయింది.

ఎక్కడా ఉద్యోగం చేయనివాడు సీజన్ టిక్కెట్టుమీద గుడివాడ నుంచి విజయవాడకు రోజూ ఎందుకు తిరుగుతున్నాడో అర్థం కాలేదు నాకు.

'మరి రోజూ ఎందుకు ప్రయాణం చేస్తున్నావ్?' మెల్లగా అడిగాను

అతను గుండెనిండా గాలి పీల్చుకొని అతి నెమ్మదిగా అన్నాడు,

'ఉద్యోగ రీత్యానే!'

మళ్లీ ఆశ్చర్యపోయాను.

'మరి ఏ ఆఫీసులోను వుద్యోగం చేయటం లేదన్నావుగా?'

'అవున్సార్! నేను ఆఫీసులో చేయటంలేదు! నిజమే! నేను పని చేసేది ఈ రైల్లోనే!' శూన్యంలోకి చూస్తూ సమాధానం చెప్పాడు.

అతను జోక్ చేస్తున్నాడన్పించింది.

'ఏం వుద్యోగం?' అన్నాను ఎగతాళిగా

'పేకాట!'

అతని నోట్లోంచి దూదిపింజెలా వెలువడ్డ ఆ మాట నా మనస్సులో చేరి డైనమైట్‌లా ప్రేలింది.

'మాస్టారికి నా పరిస్థితి అర్థమైనదను కొంటాను!' విరక్తిగా నవ్వుతూ అన్నాడు.

ఎమర్జన్సీ కాలంలో అకారణంగా అరెస్టు చేయబడిన వ్యక్తి ముఖంలో కల్గే ఆశ్చర్యం, అయోమయం, సందిగ్ధత నాలోకూడా కల్గాయి.

'మీరేకాదు మాస్టారూ! నా విషయం తెలియగానే అందర్నూ యిలాగే ఆశ్చర్యపోతారు!'

'ఎంతవరకు చదువుకొన్నావు?'

'టెన్త్ క్లాసు తప్పాను!'

'పూర్తి చేయటానికి ఎందుకు ప్రయత్నించలేదు?'

'ఒకప్రక్క యింటి బాధ్యత, మరోప్రక్క ఈ వుద్యోగ బాధ్యత అవకాశం యివ్వటంలేదు సార్!'

'అంటే...'

'అవున్సార్! మాది పెద్దకుటుంబం! మా నాన్న బట్టలకొట్లో గుమాస్తా! మా అమ్మ జబ్బుతో మంచంలో వుంది టెన్త్ తప్పి ఇంట్లో కూర్చున్న ఓ అక్కయ్య ఎలిమెంటరీ స్కూల్లో చదువాపేసిన ఓ చెల్లాయి, అ, ఆలంటే ఏమిటో తెలియని ఇద్దరు తమ్ముళ్లు మా ఫామిలీ మెంబర్స్! మా నాన్న సంపాదించే సంపాదనతో మా యిల్లు గడవటం కష్టంగా వుంది. అందుచేతనే ఈ ఉద్యోగాన్ని చేపట్టాల్సివచ్చింది సార్!' అన్నాడు ఎంతో తేలికగా

'నీ ఉద్దేశంలో ఇది కూడా ఉద్యోగమేనా?'

'తప్పకుండా సార్! మీకు తెలీదేమోకాని మా నాన్నకంటే ఎక్కువే సంపాదిస్తున్నాను కనీసం రోజుకు రెండు జాక్‌పాట్స్ కొట్టడం ఖాయం! ఖర్చులన్నీపోను పదిరూపాయలు మిగుల్తాయి. చెప్పకోకూడదుకాని నాది గోల్డెన్ హ్యాండ్ సార్!' అంటూ తన చేతిని ముద్దుపెట్టుకొన్నాడు.

అతని ఆత్మవిశ్వాసానికి ఆశ్చర్యపోయాను

'మరి మీ నాన్నకీ విషయం తెలుసా?'

'తెలియవచ్చు! తెలియకపోవచ్చు! విజయవాడలో ఏదో జాబ్ చేస్తున్నానని చెప్తూవస్తున్నాను యింతకాలం. కాని నిజాన్ని ఎంతోకాలం దాయలేం సార్!'. నిజం తెల్సినా ప్రమాదంలేదు సార్! మా నాన్నకు తెల్సినా తెలియనట్లే ప్రవర్తిస్తాడు రాత్రి అయ్యేసరికి పదిరూపాయలు ఆయన చేతిలో పెడ్తాను

'మరి విజయవాడ వచ్చి సాయంత్రందాకా ఏం చేస్తావ్?'

'అలా అలా తిరిగి ఏ మ్యాట్నీనో చూసి మళ్లీ సాయంత్రం బండెక్కి ఉద్యోగులతో పేకాడతాను!'

అతని పరిస్థితిని తల్చుకొంటే నాకు జాలి కల్గింది. పేకాటతో సంసారాన్ని పోషిస్తున్నాడా?

'ఇలా చేయటం నీకు అవమానంగా లేదా?'

'ఎందుకు సార్! చాలా గర్వంగావుంది కూడా! బహుశా మీకు తెల్సివుండదు. పేకాటలో జోకర్‌గాడికి వ్యక్తిగతంగా విలువలేదు. ముక్కల

మధ్య వుంటే వాడికున్న విలువను అంచనా కట్టలేనంతగా వుంటుంది. ఈ డబ్బే సంపాదించకపోతే నాకు విలువ శూన్యం. ఏకాంతంగావున్న జోకర్‌గాడికి పేకాటలో గుర్తింపు లేనట్లుగా ఈ సంపాదనే లేకపోతే మా ఇంట్లో నా ఉనికిని గమనించేవారే వుండరు. పది రూపాయలు మా నాన్న చేతిలో పడవేస్తేనే నాకు వ్యక్తిత్వం వస్తుంది, గుర్తింపు వస్తుంది. ఇప్పుడు చెప్పండి సార్! జోకర్‌గాడికి నాకు పోలిక లేదంటారా?

నాకు ఏం చెప్పాలో తెలియక 'ఆ పరిభాష నా కర్థంకాదు!' అన్నాను

అతను విరగబడి నవ్వేడు

అతని నవ్వులో వేదన వుంది.

అతని గుండెల్లో అగ్నిగుండం వుంది.

'ఏదైనా ఉద్యోగం చూసుకోవాలనిలేదా?'

'ఉద్యోగం చేస్తేమటుకు ఇంతకంటె ఎక్కువ ఎలా సంపాదించగలను మాస్టారూ? అయినా నాకు ఉద్యోగం ఎవరిస్తారు మాస్టారు?' అంటూ మెల్లగా బెంచీమీద నడుం వాల్చబోయాడు.

'ఎవరైనా యిస్తే చేస్తావా?'

పడుకోబోతున్నవాడల్లా చటుక్కున లేచి కూర్చుని 'తప్పకుండా చేస్తాను సార్!' అన్నాడు.

నేను చేతిలో వున్న డైరీని తీసి తెల్లకాగితమ్మీద ఓ అప్లికేషన్ వ్రాసి సంతకం చేయిమన్నాను.

'ఏమిటి సార్ యిది?' అన్నాడు.

'మా ఆఫీసులో వేకెన్సీ ఒకటి రాబోతుంది. అప్లికేషన్‌మీద సంతకంపెట్టు! అదృష్టం బాగుంటే ఉద్యోగం రావచ్చు!' అన్నాను పెన్ అందిస్తూ.

'థాంక్యూ సార్! థాంక్యూ వెరీమచ్!' అంటూ నా చేతిలోంచి పెన్ తీసుకొని సంతకం చేశాడు

*   *   *

—"హాఁ.. మాస్టారూ! పార్వతిలేనిలోటు ఈరోజు కన్పిస్తూనేవుంది కదండీ!' అన్నాడు శర్మ నా భుజంతట్టుతూ.

గతాన్ని త్రవ్వుకొంటున్న నా మనస్సు ఆలోచనల అగడ్తపారను అవతల పారేసి వర్తమానంలోకి వచ్చింది.

"గుడివాడ వచ్చేస్తూంది! జాక్‌పాట్ వేయండి గురూ!" అంటున్నాడు ప్రసాద్.

'జాక్‌పాట్‌కు టైమ్ లేదు. మామూలాట వేయండి!' అన్నాడు శర్మ.

మూర్తి ముక్కలు కలిపి అందరికీ పంచాడు

'పార్వతి ఎందుకని రాలేదంటారు?' అని అడిగాను శర్మను.

'నాకేం తెల్సు బాబూ! పార్వతి గురించి నాకంటె మీకే ఎక్కువుగా తెల్సివుండాలి!' అన్నాడు శర్మ.

బల్లమీదున్న మాగజైన్ తీసి పేజీలు త్రిప్పసాగాను

రైలు వేగంగా పరుగులుతీస్తూంది.

పేకాట జోరుగా సాగుతూంది! అందరూ

# వేస్టు జోకర్

సస్పెన్స్ సిన్మా చూస్తున్నట్లు నిశ్శబ్దంగ వున్నారు. గుండెల్ని అరిచేతుల్లో పెట్టుకొని ఆడుతున్నారు.

అలాంటి సమయంలో గుడివాడ స్టేషన్ వచ్చేసింది

బండి ఆగింది. అయినా ఆట పూర్తికాలేదు

క్లయిమాక్స్ సీన్‌కోసం తొందరపడుతున్న డైరక్టర్‌లా శర్మ తెగ హడావుడిపడుతున్నాడు

పేకలోంచి అందరూ తలో ముక్క తీసి నిస్పృహతో క్రింద పడేస్తున్నారు.

ఆట గసపట్టులో వుంది.

హఠాత్తుగా శర్మ 'షో!' అంటూ అరిచాడు

'ఈ ముక్కకోసం ఎన్ని రౌండ్స్ తిరిగాయి గురూ!' అంటూ అప్పుడే తను పేకలోంచి తీసిన ముక్కను అందరికీ చూపించాడు శర్మ.

'జోకర్ వేస్ట్! పూర్‌ఫెలో! ఇంతవరకు ఆటను సేవ్‌చేసి ఇప్పుడు తను వేస్ట్‌కార్డ్ అయ్యాడు!' అని శర్మ మిగతావాళ్లకు చెపుతున్నాడు

అందరూ తమ శక్తిమేరకు ముడుపులు చెల్లించుకొని రైలు దిగారు.

**వనితలకు మనవి**

**కొత్తరకం వంటలు**

**క్లుప్తంగా వ్రాసి పంపితే**

**త్వరగా పరిశీలించ వీలు —సం.**

శర్మ, ప్రసాద్ నాకు "గుడ్‌నైట్!" చెప్పి దిగిపోయారు.

వాళ్లవైపే చూస్తున్న నా కళ్లకు తళుక్కున ఓ మెరుపు మెరిసినట్లయింది. లైటు వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా కన్పిస్తూంది ముఖం నిండా దిగులు చోటు చేసుకొన్నప్పటికీ ఆమెలోని అందం నన్ను దృష్టిని ప్రక్కకు మరల్చనీయలేదు. ఎప్పుడో ఎక్కడో చూసినట్లన్పించింది ఆలోచించాను అవును! ఆమె తప్పకుండా పార్వతి అక్క అయివుంటుంది. అవే కళ్లు, అదే ముక్కు, అదే రూపం! తప్పకుండా పార్వతి అక్కే అయివుండాలి..

రైలు కదిలేవరకు ఆమె వెళ్తున్నవైపే చూస్తూండిపోయాను

*   *   *

నెల రోజులపాటు ప్రివిలేజ్ లీవ్‌ను వాడుకొని తిరిగి డ్యూటీలో చేరటానికి వెళ్తున్న నాకు గుడివాడ స్టేషన్లో ప్రసాద్ కన్పించాడు అతను చెప్పిన సమాచారం వినగానే కొయ్యబారిపోయాను మనస్సంతా శూన్యమైపోయింది. నవనాడులూ కృంగిపోయాయి అలానే బెంచీమీద కూర్చుండిపోయాను.

'మీకీ వార్త ఎంత షాక్‌ను కల్గిస్తుందో నాకు తెల్సు మాస్టారూ! మీకే కాదు! ఈ నెల రోజుల నుంచి మేము ఈ విషాదాన్ని అనుభవిస్తున్నాం! రోజుకోసారైనా పార్వతి మా కళ్లముందు మెదలాడ్తాండే!'

'అసలీ ప్రమాదం ఎలా జరిగింది?' వణుకుతూ అడిగాను

'పార్వతి రాలేదేమని మీరు ఆ రోజు అడిగారు గుర్తుందా? గుడివాడ స్టేషన్లో వాళ్లక్క మమ్మల్ని కల్సుకొని పార్వతికి సుస్తీగా వుందని అయిదు రూపాయలుంటే యివ్వమని అడిగింది శర్మ యిచ్చాడు. పూర్‌ఫెలో... రెస్ట్ తీసుకోకుండా, కళ్లు తిరుగుతున్నా లెక్కచేయక స్టేషన్‌కు వచ్చాడట మర్నాడు ఎవరో ముసలమ్మ పట్టాలు దాటబోవటం చూసి ఎదురుగా వస్తున్న గూడ్సు బండి బారినుంచి ఆమెను తప్పించటానికి ప్రయత్నించాడు ముసలమ్మ ప్రాణాలను రక్షించాడు. కాని తన ప్రాణాలను పోగొట్టుకొన్నాడు!'

ప్రసాద్ ఆ సంఘటనను చెబుతుంటే నా శరీరం వణికిపోయింది పార్వతి రూపం కళ్ల ముందు మెదిలింది.

'మా అందరికంటె మీకే అతి సన్నిహితంగా వుండేవాడతను! పేరు పార్వతీశం అయినా మీరు ముద్దుగా 'పార్వతీ!' అని పిలిస్తే ఎంతో పరవశించేవాడు పాపం! అతన్ని మర్చిపోవటం చాలా కష్టం!' అన్నాడు ప్రసాద్

'నేను మర్చిపోయినా యిది మర్చిపోనివ్వదు ప్రసాద్‌గారూ!' అంటూ జేబులోనుంచి కవరు తీసి అతనికి అందించాను.

'అపాయింట్‌మెంట్ ఆర్డర్!' అన్నాడు ఆశ్చర్యంగా

'అవును ప్రసాద్! పార్వతికి నచ్చజెప్పి అప్లయి చేయించాను మా మేనేజర్‌కు చెప్పి అటెండర్ పోస్ట్‌కు పార్వతిని రికమెండ్ చేయించాను. నెల రోజుల క్రితమే ఈ పోస్టింగ్ అతనికి వస్తుందని నాకు తెల్సింది. ఆ శుభవార్తను అప్పుడే చెప్పాలనుకొన్నాను కాని మరెప్పటికీ చెప్పలేనన్న నిజం ఈనాడు తెల్సింది!' అన్నాను దిగులుగా

'ఈ ఆర్డర్ మీకెలా వచ్చింది?' ప్రసాద్ అనుమానంగా అడిగాడు

'అప్లికేషన్లో అతను కేరాఫ్ అడ్రస్ నాదే యిచ్చాడు. నిన్ననే వచ్చింది ఆర్డర్!'

"బాడ్‌లక్!" అంటూ ప్రసాద్ ఆర్డర్ కాగితాన్ని నా చేతికిచ్చాడు.

"అతనిది చాలా పూర్‌ఫామిలీ! అతను లేకుండా వాళ్ల సంసారం గడవటం చాలా కష్టం' పాపం వాళ్లెలా బ్రతుకుతారో?' అన్నాను

ప్రసాద్ సిగరెట్‌ను వెల్గించుకొంటూ అన్నాడు "పార్వతీశం లేనిలోటు వాళ్లక్క తీరుస్తుందిలే!"

అతని మాటల్లోని వ్యంగ్యం, గూడార్థం నాకు అంతుపట్టలేదు.

'అంటే..' అన్నాను

'ఆమె కూడా పార్వతీశంలా ఈ రైలునే నమ్ముకొంది!'

'ఎందుకు?'

'ఉద్యోగం చేస్తూందిగా!'

'ఏం ఉద్యోగం?' ఆశ్చర్యంగా అడిగాను

'వ్యభిచారం!'

నా చేతిలోని కాగితం పెండోలోంచి వచ్చిన గాలితోపాటు పైకెగిరిపోయింది